# ప్రజాసేవ

ఆ గ్రామంమీదకూడా–"దాడిజరుగుతుంది" అనే పుకార్లు ప్రబలంగా వ్యాపించుతున్నాయి. కొంత మంది– "యిదంతా అనవసర ఆందోళన" అని తేలిగ్గా తోసివేస్తున్నారు. "షాహుకారు నారయ్య వగైరా పది మందిదాకా ప్రజలు ఆ గ్రామంలోకూడా వున్నారు గనుక, ఆ పదిమంది ప్రజల రక్షణకోసరం దాడి జరగక తప్పదు" అని సహేతుకంగా నిరూపిస్తున్నారు. మరికొంత మంది–

ప్రజానాయకుడు షాహుకారు నారయ్యగారు కుండా యీపై విషయాన్నే ధృవపరిచాడు. "అనవసర భయం అనవసరం" అని ప్రకటించాడు. "ఐతే అదీ ప్రజలైనవాళ్లకు మాత్రమే" అని ఓమరతు పెట్టాడు. అసెంబ్లీలోని ప్రశ్నోత్తరాల ఆధారాన్ని చూపుతూ– షాహుకారు నారయ్య వారంటే...

'వారి వారి తాతముత్తాతల కాలంనించీ కూడా కరిత్రో ఆగాప్రిమాన్ని సరిచేసుకుంటూ వచ్చిన వారుగనుకా; కాంగ్రెస్ హయాంలోసైతం ఎలాంటి సత్యాగ్రహాలకూ పాల్పడకుండా ఆగ్రామాన్ని కాపాడు కుంటూ వచ్చినవారు గనుకా; తన జీవితం 'హరీ' అనే

యాత్రై

వరకూ ఆవూరిమీద మమకారం పోయేట్టులేదుగనుకా; ఆ-తన స్వగ్రామాన్ని దాడినుంచి తప్పించదలచుకున్న వాడై, ఆ గ్రామస్థుల నందర్నీ ప్రజల్లో చేరిపోవలసింద'ని సలహా యిచ్చాడు. కొంచం కష్టకార్యమే ఐనా తాను అందుకు సర్వసహాయాలూ చెయ్యగలనని హామీ యిచ్చాడు కూడాను.

నిజానికి బ్రిటిష్ ప్రభుత్వంక్రిందకూడా ఆగ్రామస్థులు ప్రజలుగానే వున్నారు. కాని మరీ ఒక సంవత్సర కాలంనుంచే వాళ్లు 'ప్రజ' అంతస్థునించి దిగజారిపోయినట్లు స్పష్టమయింది. స్పష్టంకావడం ఈ ఏడాదిలోనే ఐనప్పటికీ, వీళ్ల 'ప్రజాత్వపతనం ప్రారంభంకావడం మాత్రం యుద్ధ కాలంలోనే' అన్న విషయం చారిత్రక పరిశీలనవల్ల తేలింది.

యుద్ధ కాలంలో 'కరువు' కంట్రోళ్లు, బ్లాక్ మార్కెట్ బానిసత్వం, అంటూ గోనగడం మొదలెట్టి-షాహుకార్లను దోచుకు తినాలనే స్వార్థంతో సమ్మెలు కట్టి, పరానికి దూరమై, 'తిండిగుడ్డ' అనే ఐహికవూబిలో దిగి, అటుజారి యిటుజారి పుటుక్కున ప్రజలేకాకుండా పోయారు.

ఎటుతిరిగీ ఆ గ్రామం మొత్తంలో పతనానికి గురికాకుండా నిలబడిందల్లా షాహుకారు నారయ్య, వారి అనుచరులు యింకో పదిమంది మాత్రమే-

అన్ని ఆటుపోటుల్లోనూ అచంచలంగా నిల బడగల ధీరులు యీ ప్రపంచంలో చాలా కొద్దిమందే వుంటారు. ఆకొద్దిమందిలోనూ నారయ్యగారు ఒకడూ.

ఐతే యీ విషయంలో అభిప్రాయభేదంకూడా వున్నమాట సత్యం. అదేమంటే "మొన్నటిదాకా జస్టిస్ పార్టీలోవున్న నారయ్యగారు - కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమాంతం కాంగ్రెస్ ఐపొయ్యాడుగదా--" అని

అది- "ఏ యెండకు ఆగొడుగు పట్టడం"-అనీ

ఇలా అనేవాళ్లు జనాభా లెక్కలో అధిక సంఖ్యాకులే ఐనప్పటికీ, వాళ్లంతాకూడా ప్రజాత్వాన్ని కోల్పోయిన పామరులే కావడంవల్ల-;

-'ఏయెండకాగొడుగు' అన్నపదం-నింద్యగ్రామ్యం ఐపోయింది. పోతే-"కాలానుగుణ్యాం" అనే ఆపద్ధర్మ సూత్రప్రకారం నారయ్యగారు అమాంతల కాంగ్రెస్ అవడం ఆక్షేపణీయంకాదు గనుక ఆ భేదాభిప్రాయం నిరాధారమై వూరుకున్నది.

ఏతావతా అసలు విషయం ఏమిటంటే-

'ప్రజల్లో చేరండి' అన్న నారయ్యగారిసలహా అక్కడివాళ్లకు ఆసాంతంగా నచ్చకపోయినా ఆలోచనలోమాత్రం పెట్టింది.

తెలివిగలవాళ్లు ఎటూ తెలివిగలవాళ్లే గనుక, కుతర్కాలకు పోక కొంతమంది వెంటనే పావలాపారేసి

ప్రజాత్వం కొనుక్కున్నారు. అంతకుపూర్వం, ఎన్నికలు పదవులుకోసం సంతకాలతో సైతం నిమిత్తంలేకుండా లభ్యమయ్యే సభ్యత్వం రానురాను ధరపెరిగి, చివరివాళ్లు బ్లాక్‌మార్కెట్టులో ప్రజాత్వాన్ని కొనబోయేసరికి వందలూ, వేలూ, అయి ప్రామిసరీనోట్లుకూడా వ్రాయాల్సివచ్చింది. మరీ మొద్దు రకానికి దేహాశుద్ధి చేస్తేనేగాని ప్రజార్హతరాని ఘటనలుకూడా వున్నాయి. ఐనా-యింకా కొందరు 'ప్రజాత్వం' సంపాదించాలనే తహతహకూడా లేని ద్రోహులు సైతం కొద్దిమంది మిగిలిపోయారు.

'యీ నూతనంగా ప్రజాత్వం పుచ్చుకున్న వాళ్లలో ప్రజాత్వం ఎంతవరకూ నిల్చిందీ? సర్వ కష్టాలలోనూ యీ అమూల్య వస్తువును నిబ్బరంగా నిలబెట్టుకోగల శక్తి సంపన్నులయ్యారా? లేదా?' అన్న సందేహాలు నారయ్యగార్ని యింకా పీడిస్తూనే వున్నాయి. అందుచేత-

భగవంతుడు-భక్తులను బాధించి బాధించి పరీక్షించడం భారత సాంప్రదాయం కాబట్టీ; శ్రీరామచంద్రమూర్తి స్వజనంలోనిదైన సీతను అగ్నిపరీక్షకు గురిచేయడం సోదాహరణంగా కనిపిస్తున్నది కాబట్టీ; యిక తాను పరజనాన్ని పరీక్షకు నిలబెట్టడం ఏమంత కష్టంకూడా కాదుకాబట్టేన్నీ ఆగ్రామస్తుల ప్రజాత్వాన్ని పరీ

క్షించడానికి తానే స్వయంగా పూనుకున్నాడు.

'దేశ సౌభాగ్యంకోసరం ఎక్కువపని-తక్కువ కూలి' నినాదం యిచ్చాడు.

నూతన ప్రజలు-తమ ప్రజాస్వామ్యతను చాటుకోడానికి ముక్కుతోనో మూలుగుతోనో చేశారు. ప్రథమ పరీక్షకు తట్టుకుని నిలబడ్డారు.

షావుకారు నారయ్యగారుకూడా యీ నినాదంవల్ల తనకుగలిగిన లాభాన్ని అంకెల్లో అంచనా కట్టాడు. దేశమంటే తానుకూడా గనుకనూ, తన సౌభాగ్యం దేశ సౌభాగ్యమే గనుకనూ విశ్వవ్యాపిత దృష్టితో సంతుష్టిపడ్డాడు.

దేశీయ ఆర్థికాభివృద్ధికోసం 'తక్కువ జీతం-ఎక్కువ పన్నులు' అన్నాడు యీసారి.

యీసారికూడా ఏదో కొద్దిమంది మినహా చాలావరకూ మధ్యమ శ్రేణిలో నెగ్గారు.

యీ ఉత్సాహంతో- 'జాతీయ పుష్టికోసరం, ఆత్మ నిగ్రహశక్తి కోసరం, ఒళ్లుబలిసి తప్పుదారులు తొక్కకుండా ఉండేందుకోసరం, వారంరోజులు నిరసన వ్రతం-మామూలుపని' అన్ననినాదం యిచ్చాడు. (తిండి ఎలాగూ తినడంలేదుగనుక జీతాలు అనవసరం అన్నది సువిదితమే.) అదంతా దేశీయ ఆర్థికాభివృద్ధ్యర్థం తన ఖజానాలో జమ కట్టించదలచుకున్నాడుకూడా.

కాని ఈ తఫా ఒక్కళ్ళుకూడా పరీక్షలో నిలబడలేదు. నూతనంగా వచ్చిన ప్రజాత్వంకాస్తా ఈ దెబ్బతో దిగిపోయింది.

యిక నారయ్యగారు 'మర్దనం గుణవర్ధయేత్' అన్న ధర్మసూత్రాన్ని తలచుకున్నవాడై, పరోపకారార్థం వెధవశరీరం అన్నారుగనుక- అంతలావు శరీరం ఆయాసపడుతుందన్నైనా చూడకుండా హుటాహుటి వెళ్ళిపోయాడు. చట్టబద్ధులైన ప్రజారక్షకుల దగ్గరికి-

'సామదాన భేదోపాయాలు సర్వం ఐపోయాయనీ, 'చతురోపాయమైన దండోపాయం మాత్రమే మిగిలివుంద'నీ సవినయంగా విన్నవించుకున్నాడు. ప్రజాత్వాన్ని స్థాపించవలసిన అవసరాన్ని మొరబెట్టుకున్నాడు.

ప్రజా రక్షకులుకూడా దండోపాయమే తమ ధర్మంగనుకా, అందుకే తాము వున్నారుగనుకా తక్షణమే సిద్ధపడ్డారు. దిగీదిగడమే యింటింటా జొరబడ్డారు... ఏకజండా, ఏకపార్టీ, అంతా ఏకత్వానికే ప్రాధాన్యంగల కాలంగనుక-యిళ్ళల్లోని బియ్యం, పెసలూ, పచ్చళ్ళూ సర్వమూ కలిపి వివిధ వస్తువుల ఏకత్వం ఏలా సాధ్యమో నిరూపించారు. అంతేగాకుండా ద్రవ, ఘన, పదార్థాల ఏకత్వంకూడా 'సుసాధ్యం' అని నిరూపించడానికి కిరోసిన్ సైతం కలిపి మిళితం చేశారు.

కొంతమంది ప్రజాపతనానికి నాయకులైన

వాళ్లయిళ్లు కుట్రపన్నడానికి స్థావరాలయ్యే అవకాశం వుంది కాబట్టి-అలాంటి యిళ్లను ప్రజాపతి నారయ్యగారి సలహా సంప్రదింపులపై కొన్నింటిని పీకీ, మరీ ప్రధానమైన వాటిని దహనసంస్కారం గావించీ వదిలారు. ఇలా అనేకవిధాల షాహుకారుగారిని సంతుష్టిపరచి, సర్వం చక్కపరచి మరీ చక్కాబోయారు.

మర్నాడు ఉదయానికి తేలిన అనధికార అభిజ్ఞ వర్గాల అంచనాలప్రకారం ఒక యింట్లో కామ్రేడ్ కోడి గుడ్డూ, మరోచోట కామ్రేడ్ కానులపేరూ, యింకా కామ్రేడ్స్ మేకపోతూ, మనీపర్సూ వగైరా వగైరాల అరెస్టులు జరిగాయని తేలింది.

యింకో ధృవపడిన వార్త ప్రకారం-ప్రజాత్వం కోల్పోయిన వాళ్లతోబాటు పాతప్రజలక్కూడా పల్చపల్చగా దండప్రయోగం జరిగినట్టుతేల్తోంది. అందుకు కారణం ప్రజారక్షకులు బహుశా 'అధికస్య అధికంఫలం' అని భావించి, ప్రజాత్వం అసలు ప్రజల్లోకూడా అధికం కావడానికి అలాచేసి వుంటారని ఊహించబడుతోంది.

ఇంతకూ పునర్నిర్మాణానికి ప్రజాపతి నారయ్యగారు గావించిన యీ అంతిమ ప్రయత్నంవల్ల కలిగిన ఫలితం యేమంటే-పాత ప్రజలుగావున్న పదిమందిలోనూ-కొంతమందికి తలలుపగిలి ఆగాయాలవల్ల కారిననెత్తురు, కన్నీళ్లతోపాటుగా ప్రజాత్వపు నిషాకాస్తా దిగిపోయి

వూరుకున్నది.

మొత్తంమీద ఆ గ్రామం సర్వస్వం బ్రిటిష్ ప్రభుత్వ హయాంలోని కాంగ్రెస్ వాళ్లలాగా, యీనాడూ మలయా, బర్మాలలోలాగా అంతా దుండగీంద్రమయమై పోయింది. ఇక యీనాడు ఆ గ్రామంలో మిగిలిన 'ప్రజ'అల్లా నారయ్యగారు ఒకే ఒకడు అయిపోయాడు.

ఐతే నారయ్యగారు ధీరోదాత్తులు గనుక, చింతాక్రాంతులు కావడానికిమారుగా ఆగ్రహావేశులై — ఆముదం త్రాగేవాడిలా మొహంపెట్టి "వెధవలు. పులుపు గబ్బు వెధవలు. ఈ వెధవలకు ప్రజాత్వం తెప్పించడం ఎవడికి కావాలి. ఈ వెధవాయిలకోసరం ఎగిరిన ఎగురు డంతా ఏ పర్మిట్ కోసరమన్నా ఎగిరివుండాల్సింది." అంటూ రాజవీధులనుంచి నిష్క్రమించినవాడై — దుండగీండ్ర మధ్య 'ప్రజ' ఐన ఒకే ఒక తాను వుండటం ఆత్మగౌర వానికి అట్టే మంచిదికాదు గనక ఒకనాటిరాత్రి అమాంతం స్వకుటుంబ సపరివారసమేతంగా అంతర్ధా నమై వూరుకున్నాడు.

నీతి :— ఇది ప్రజాయుగం.

ఫలశ్రుతి :— ఇంతవరకూ 'ప్రజలు, ప్రజ' అన్నపదాలు నిత్య బహువచనాలుగానేవుండిపొయ్యాయి. ఇక విశ్వసాహిత్యంలో పై పదాలకు ఏకవచనరూపం ఏర్పడే అవకాశంకలగడం శుభసూచకం. —